
# మంచి – చెడూ – మనిషి –



వీధుల్లో జనం పలచబడ్డారు.

వీధిదీపాలు వెలవెలబోతున్నాయి. చీకటి నల్లగా మసి పూసినట్టు అంతటా వ్యాపించి ఉంది.

శివనారాయణ ఆలోచించుకుని నడుస్తున్నాడు.

ఈ రోజు ఆఫీసు అయిన తరవాత మేనేజరు మాణిక్యాలరావు శివనారాయణని బలవంతాన హోటల్‌కి తీసుకువెళ్ళి, రెండుగంటలసేపు హితబోధ చేశాడు. అంతా చెప్పాక "ఇందులో కొంత నా స్వార్థమూ లేదనను. కానీ నేను మనస్ఫూర్తిగా నీ మంచి కోరినవాడిని. జీవితంలో సుఖాలు వాటంతట అవి రానప్పుడు, మనమే అందుకు అనుగుణంగా మలుచుకోవాలి. అందులో తప్పు ఏ మాత్రమూ లేదు. స్వార్థము లేని దెవరికి, చెప్పు? నా కూతురు తరఫున నేను మాట ఇస్తున్నాను. నీ పిల్లలకే లోటూ రాదు. ఆలోచించుకో. ఏమంటావు?" అని అడిగాడు.

మాణిక్యాలరావుకి ఏడుగురు ఆడపిల్లలు. పెద్దపిల్లలు ఇద్దరికీ ఎలాగో పెళ్ళి అయిందనిపించేశాడు. మిగతావాళ్ళు ఒకరొకరుగా పెళ్ళికి ఎదిగి వస్తున్నారు. ఆయన బాధ ఆయనది. శివనారాయణ అందగాడు. వయస్సూ అంత లేదు. పైగా, ఉద్యోగస్థుడు.

అనుకోకుండా మొదటిసారి కామేశ్వరరావుద్వారా శివనారాయణని కలిసి చూశాడు మాణిక్యాలరావు. ఆ విశ్వాసానికి గుర్తే పదిరోజుల్లో ఫలితమే.

శివనారాయణ ఒక్కసారిగా తెల్లబోయాడు. 'నాకా? ఇప్పుడా?' అని ఆశ్చర్యంగా అన్నాడు.

కామేశ్వరరావు నవ్వాడు. "అవును. మాణిక్యాలరావు గారే పట్టుపడుతున్నారు" అన్నాడు. అతనికి శివనారాయణ మౌనంలోని పరమార్థం గ్రహించడం కాలేదు.

అందుకే 'ఇదిగాదు పధమ'ని మాణిక్యాలరావుగారే స్వయంగా కొంగజేసుకుని కార్యరంగంలోకి ఉరికారు. అమ్మాయి ఫొటో తెచ్చి శివనారాయణకి చూపించి, "ఎలా ఉంది? నీకు నచ్చిందా?" అని అడిగారు.

శివనారాయణ నవ్వాడు, సమాధానం చెప్పకుండానే.

కాని అంత తేలిగ్గా వదిలిపెట్టదలుచుకోలేదు మాణిక్యాలరావు. రోజూ ఆఫీసయిన తరువాత శివనారాయణని ఎలాగయినా తీసుకువెళ్లి ఆ విషయమే కదిలించేవాడు. అందులోని లాభనష్టాలని వివరించి ఒప్పించేవాడు. ఆఖరికి వైకుంఠాన్ని చూపించి, "ఏమంటావు? కన్న తండ్రిగా పిల్లనిచ్చి పంపే బాధ్యత నాదేనయ్యా?" అని నవ్వేవాడు. ఎట్లాగయినా మాణిక్యాలరావు తన పెరిగినవాడు. శివనారాయణని తన అల్లుణ్ణి చేసుకుంటే కష్టకాలాల బాధ తగ్గుతుందని మాణిక్యాలరావు.

ఈ లోకంలో మంచిని గుర్తించే వాళ్ళు తక్కువ. చెడు లేకపోయినా, ఉంది అని రంగులు పూసేవారు ఎక్కువ. కొందరి మంచితనం బయటకు కనిపించదు. దానిని గుర్తించి ఎవరూ బయటకు తియ్యక పోతే ఆ వ్యక్తి అన్నివిధాల అసంతృప్తితోనే క్రుంగిపోవలసి వస్తుంది.

ఉండుండి మాణిక్యాలరావుకి కోపం వచ్చింది. అందుకే వెంకటేశం లేక శివనారాయణని నిలదీసి ఆ పెళ్లి సంబంధానికి అయిన నిర్ణయం చెప్పమన్నాడు.

"వాళ్ళ పెద్ద ఒకటే తొందరపెడుతున్నారు" అని చెప్పాడు మాణిక్యాలరావు.

శివనారాయణ వెంటనే సమాధానం చెప్పలేక పోయాడు. ఆ విషయం ఆలోచించినప్పుడల్లా తల వేడెక్కిపోతున్నది. ఎటూ తేల్చుకోలేకపోయాడు.

"రేపటిదాకా గడువివ్వండి. రేపు చెబుతాను తప్పకుండా" అని అయన్ని వదిలించుకునేసరికి ఎనిమిదిన్నర అయింది. ఇంటికి వచ్చేదారిలోనే వెంకటేశం బాను ఉంది.

వెంకటేశం బానుదగ్గరనించి వెళ్తూ ఉండగా వెనకనించి కామేశ్వరరావు కేక వినిపించింది. గదిలో నించి నవ్వులు, కేకలు, డబ్బు గలగలలు. ఆ వాసనలు శివనారాయణ మనసులో ఒక్కసారి లాగాయి. ఆసు, రాణి, రాజీలు కళ్ళముందు మెదులుతూ ఆహ్వానించాయి.

ఒక క్షణం కన్నుమూసి నిగ్రహించుకుని గబగబా అడుగులు వేసాడు ముందుకి శివనారాయణ.

"ఏరా, శివం! బొత్తిగా అప్రస్తుతమైపోయావే. ఒకసారి వచ్చి పోగూడదూ?" అంటూ పరిగెత్తుకుంటూవచ్చి కలుసుకున్నాడు కామేశ్వరరావు.

"ఏం చేస్తే, అట్లా ఉన్నావు? ఇంకా ఆ బాధ మరచిపోలేదా? అయితే ఒకసారి లోపలికి పోదాం రా. వెళ్ళి, కాస్త మందు వేసుకుని, రెండు ఆటలు ఆడితే మళ్ళీ మామూలు మనిషి అవుతావు" అన్నాడు.

"............"

## పాలడుగు వెంకటేశ్వరరావు

"నిజంగా నువ్వు లేకపోతే ఆట రంజుగా లేదురా! చూస్తూండగానే ఏట్లాంటివాడివి ఎలా అయి పోయావు? వస్తున్నావా?" అంటూ శివనారాయణ చెయ్యి పట్టుకున్నాడు కామేశ్వరరావు.

శివనారాయణ అటూ ఇటూ చూశాడు. కాని వెంటనే శివనారాయణకి ఇల్లూ, పిల్లలూ జ్ఞాపకమొచ్చారు. ప్రొద్దునగా వాళ్ళని వదిలిపెట్టి బయటికి వచ్చాడు. 'ఎట్లా ఉన్నారో?' అనిపించింది. గుండెలు గుబగుబలాడాయి.

"పని ఉంది. వస్తానురా" అని చెయ్యి విదిలించుకుని గబగబా సాగిపోయాడు శివనారాయణ. కామేశ్వరరావు మరి మాట్లాడలేదు.

అవును. శివనారాయణకి ఈ మధ్య పిల్లల మీద జాలి కలుగుతున్నది! ఎవరూ విపరీతం కాదంటారా? విపరీతమేముంది!

రమణమ్మ ఉన్న రోజుల్లో అసలు ఇలాంటి గొడవ వచ్చేదికాదు. అప్పుడు పిల్లలూ, సంసారమూ శివనారాయణకి జ్ఞాపకమే ఉండేవారుకాదు. ఎప్పుడూ సేవా అఫీసూ, స్నేహితులూ, పేకాటా, సరదాలూ... అందులోనే మునిగిఉండేవాడు!

రమణమ్మ అతని ధోరణికి లోలోనే బాధపడేది గాని పైకి అడిగేదికాదు. అడిగినా ప్రయోజనం ఉండదని ఆమెకు తెలుసు. అర్ధరాత్రి తలుపు తట్టిన భర్తకి, నిద్రలేక ఎర్రబడిన కళ్లతో తలుపులు తీసేది రమణమ్మ. శివనారాయణకి భోజనం వడ్డించేది.



మారుమాట్లాడకుండా వెళ్ళి తినేసేవాడు. వెళ్ళి మంచంమీద పడుకుని గాఢనిద్రలో మునిగిపోయేవాడు, రమణమ్మ భోజనంచేసి వచ్చేసరికి.

శివనారాయణకి అంత ఆకలిగా లేని రోజున — అంటే బజార్లో స్నేహితులతో కలిసి ఏమయినా తిన్న రోజున — రమణమ్మని గొడవ చేసేవాడు. ఇంటికి వచ్చాక, ఆకలిగా లేదని బట్టలు మార్చుకుని పడుకునేవాడు. బ్రతిమాలేది రమణమ్మ. శివనారాయణకి కోపం వచ్చి కేకలు వేసేవాడు.

రమణమ్మ మాట్లాడకుండా వెళ్ళి గిన్నెలూ, అవీ సర్దేది. అంతలోనే ఆ సంగతి జ్ఞాపకంవచ్చేదతనికి. పొద్దున తను తిన్న తరవాత ఏ కొంచెమో ఎంగిలి పడిన భార్య, అంతవరకూ భోజనం చెయ్యకుండా తన కోసమే కనిపెట్టుకుని ఉంటుందని జ్ఞాపకం వచ్చేది. ఆ సంగతే చాలాసార్లు రమణమ్మతో అన్నాడు, "నా కోసం ఎందుకు కనిపెట్టుకుని ఉంటావు? పిల్లలు తినగానే నువ్వూ తిను" అని.

రమణమ్మ మాట్లాడేదికాదు. కాని రోజూ అతనికోసమే అభోజనం ఉండి ఎదురుచూడటం మానలేదు. ఆ సంగతి శివనారాయణ ఎరుగును. అందుకే వెంటనే లేచి రమణమ్మదగ్గిరికి వెళ్ళేవాడు విసురుగా.

"నేను భోజనం చేస్తాను."

మాట్లాడకుండా తిరిగి భోజనానికి అన్నీ అమర్చేది రమణమ్మ.

"అయితే, నేను తినకపోతే నువ్వూ తినవన్నమాట!"

". . . . . . . . . ."

"ఇట్లా నా గురించి పస్తుంటుందీ ఆ పాపం నాకు అంటగట్టాలనేగా?"

". . . . . . . . . ."

"ఏం వంట ఇది? మనుషులు తినటానికేనా? ఇట్లాంటి అన్నం నేను చచ్చినా ముట్టను" అని పీటమీదనించి లేచి నుంచునేవాడు. రమణమ్మ మాట్లాడేదికాదు.

"నేను అన్నం తినను."

జాలిపడుతూ చూసేది రమణమ్మ.

"నిన్నే, మాట్లాడవేం? నేను అన్నం తినను. వింటున్నావా?"

". . . . . . . . . ."

"ఏమీ అనవా?"

". . . . . . . . . ."

"ఇట్లా సరిగా వంట చెయ్యకుండా నామీద కక్ష సాధించాలనేగా నీ ఉద్దేశ్యం?"

". . . . . . . . . ."

"నేను నువ్వనుకుంటున్నంత అమాయకుణ్ణి కాను. నీ అసంతృప్తిని అంతా ఈ రూపంగా బయటపెడుతున్నావు. అన్నీ చల్లారి పిడచగట్టుకుపోయాయి!"

రమణమ్మ జాలిపడుతూ అతనివంక చూసేది.

"నేనంటే నీకు గౌరవం లేదు. నేను అన్నం తిన్నా, తినకపోయినా నీకు అంత లెక్క లేదు. అవునా?"

తల అడ్డంగా ఊపేది రమణమ్మ, కాదన్నట్టు.

"అయితే నన్ను ఎందుకు బ్రతిమాలవు? కొంచమయినా ఎంగిలిపడమని ఎందుకు ప్రాధేయపడవు? నేను నీ భర్తని కానా?"

## కొత్త సీరియల్

# సంపంగి

### వచ్చే సంచికలో ఆరంభం

"మిమ్మల్ని బ్రతిమాలాను. మీకు కోపం వస్తుందని ఊరుకున్నాను."

"అదేమంటే ఇదొకటి. నా కొక్కడికేనా? అక్కడికి నీకు కోపం లేనట్టు?" అని దబాయించి రెండు ముద్దలు తిని లేచిపోయేవాడు శివనారాయణ.

"పిల్లలు అన్నాలు తిన్నారా? నిద్రపోయారా?" అని ఏనాడూ అడిగిన పాపాన పోయేవాడు కాదు. పిల్లలూ శివనారాయణకి దూరదూరంగా తప్పుకు తిరిగేవారు.

పదేళ్ళ సంసారంచేసి ముగ్గురు పిల్లలు కలిగాక కూడా శివనారాయణని అర్థం చేసుకోలేకపోయింది రమణమ్మ.

అసలు రమణమ్మతో పెళ్ళి జరిగిన రోజునే శివనారాయణకి 'కోపిష్టి' అని ముద్ర పడిపోయింది. ఆ రోజునే ఏదోమాటమీద గట్టిగా కేకలు వేశాడు శివనారాయణ. రమణమ్మ అందవికారమయినది. పల్లెటూళ్ళో పుట్టి పెరగడంవల్ల రమణమ్మకి బిడియం ఎక్కువే అయింది. మనిషి బాగా నిదానస్తురాలు. మొదట్లో ఇద్దరూ అన్యోన్యంగానే ఉండేవారు.

ఇద్దరు పిల్లలు కలిగాక రమణమ్మ ఆరోగ్యం పాడయింది. మనిషి పచ్చబడి, కళ్ళు లోపలికి పోయాయి. మనిషి అస్థిపంజరంలాగా తయారయింది. డాక్టరుకి చూపించాడు శివనారాయణ. గుండెజబ్బని తేలింది. అదీ ముదిరిందట, ఆ సమయానికి!

"నీకు సంసారంమీద ఏమాత్రం అపేక్ష ఉన్నా, ఆరోగ్యాన్ని అట్లా నిర్లక్ష్యం చెయ్యవు. నీ ఉద్దేశ్యం ఏమిటి? ఇంతకాలం చెప్పకుండా ఎందుకు ఊరుకున్నావు?" అని కేకలు వేశాడు శివనారాయణ, డాక్టరుదగ్గిరనించి ఇంటికి రాగానే.

గుడ్లలో నీరు కొంగుమాటునే దాచుకుంది రమణమ్మ.

పెళ్ళయిన మొదట్లో ఏమోగాని ఆ తరవాత ఏనాడూ భార్యని ఆప్యాయంగా దగ్గిరికి తీసుకుని మాట్లాడలేదు శివనారాయణ. అప్పుడప్పుడు ఆ సంగతులు మననం చేసుకుని భార్యమీద జాలి పడేవాడు శివనారాయణ. వెంటనే కోపమూ వచ్చేది.

రమణమ్మ తనతో చనువుగా ఎందుకు మాట్లాడదు? తనేం పెద్దపులి కాదు. తనూ మనిషే. రమణమ్మకి తనంటే ఎందు కంత ఉదాసీనత? ఆ సంగతి అర్థమయేదికాదు శివనారాయణకి. శివనారాయణ అత్తవారు బాగా డబ్బు గలవాళ్ళు. బావమరిది ప్రకాశరావు వచ్చి, రమణమ్మని హాస్పిటల్లో చేర్చాడు. నెల్లాళ్ళు తనూ కాపరం ఇక్కడే పెట్టి రమణమ్మని చూశాడు. రమణమ్మ హాస్పిటల్లో చేరాక ఒకసారి మాత్రం వెళ్ళి పది నిమిషాలు కూర్చుని వచ్చేశాడు శివనారాయణ. మాటా లేదు, మన్ననా లేదు.

ఆ తరవాత రమణమ్మ ఆరోగ్యం గురించి ప్రకాశరావుద్వారా వినటంతప్ప ఒకసారీ అటు తొంగి చూడలేదు శివనారాయణ.

రమణమ్మ అవసరం అప్పుడు అంతగా కనబడలేదు శివనారాయణకి. ఆమె విలువ అతనికి గ్రహింపులేదు. అందుకే భార్య ఆరోగ్యం గురించి అంతగా పట్టించుకోనూలేదు. అదొక రకం తత్వం. ఆ సంగతంతా ప్రకాశరావుకి తెలియదు. ఆ రోజు రాత్రి వెంకటేశం గదిలో స్నేహితులతో కూర్చుని సందడిగా ఉన్నాడు శివనారాయణ.

"ఒరే, శివం! నీకోసం నీ అమ్మాయి వచ్చిందిరా" అని చెప్పాడు కామేశ్వరరావు.

నవ్వుకుంటూ లేచి బయటికి వచ్చాడు శివనారాయణ.

శివనారాయణ ఎర్రబడిన కళ్ళు చూసి నోట మాట రాక బిగుసుకుపోయింది సీత.

"నాన్నా!"

"ఏం?" గద్దించాడు శివనారాయణ.

"మామయ్య కంగారుగా ఆస్పటల్కి వెళ్ళాడు. నిన్ను పిల్చుకు రమ్మన్నాడు." సీత భయం భయంగా అంది.

"ఏం? ఏం మునిగింది?"

"అమ్మకి . . . నాన్నా! అమ్మ చచ్చిపోయిందట!" బావురుమనబోయి నోరు నొక్కుకుంది సీత.

జీవితంలో మొదటిసారిగా కంగారుపడ్డాడు శివనారాయణ.

కంగారుగా సీతని తీసుకుని హాస్పిటల్కి వెళ్ళాడు.

అప్పుడు, శివనారాయణ కొంప మునిగిపోయింది.

రమణమ్మ భూలోకయాత్ర చాలించింది.

రమణమ్మ పోయేసరికి వెలితిగా అనిపించింది శివనారాయణకి. ఆమె ఉన్నంతకాలము ఆ విలువని గుర్తించటానికి అశ్రద్ధ చేసిన శివనారాయణ, రమణమ్మ పోయిందనేసరికి ఎంతో బాధపడ్డాడు. దానికి ఒక రకంగా తన నిర్లక్ష్యమే కారణమూ అనిపించి భయమూ కలిగింది. అతని తప్పుల్ని తనలోనే దాచుకుని, పిల్లల్ని వదిలేసి శివనారాయణకు అప్పచెప్పి, తన దారి తను చూసుకుంది రమణమ్మ.

పసిపిల్లవాడిలాగ వెక్కివెక్కి ఏడ్చాడు అప్పుడు శివనారాయణ.

"బావా! చెల్లి నీ కోసం కలవరించిందట పోయేటప్పుడు! దగ్గిర నర్సుతప్ప ఎవరమూ లేము. రమణమ్మ ఇందరం ఉండీన్నీ అసంతృప్తిగానే చచ్చిపోయింది, బావా!" అన్నాడు ప్రకాశరావు కన్నీళ్లు ఒత్తుకుంటూ.

రమణమ్మకి అంత్యక్రియ లయ్యాక ఒక నెలరోజు లుంచుకుని పంపిస్తానని కూడా తీసుకువెళ్లాడు ప్రకాశరావు పిల్లల్ని.

ఇల్లు బావురుమంది. జీవితం వెలితిగా అనిపించింది. రమణమ్మ పోతూపోతూ శివనారాయణ జీవితంలోని ఆనందాన్ని తీసుకుపోయింది.

'నే నేమయినా పొరపాటు చేస్తే ఎదిరించి గట్టిగా చెప్పి ఉండాలిసింది. భార్యగా భర్తని మలుచుకునే హక్కు రమణమ్మకి ఉంది. కాని రమణమ్మ ముగ్ధావంగానే ఉండిపోయింది. తనకి దూరంగానే ఉండిపోయింది. అట్లా ఉంటూనే పిల్లల్ని అప్పచెప్పి తన దారి తను చూసుకుంది. రమణమ్మ స్వార్థపరురాలు. భగవంతుడు అన్యాయం చేశాడు. రమణమ్మకి నోరు లేకుండా ఎందుకు చెయ్యాలి? రమణమ్మ గనక గయ్యాళి అయితే ఇట్లా అయేది కాదేమో? సుమారు పదేళ్ళు కాపరం చేసీ, ముగ్గురు పిల్లల్ని కనీ రమణమ్మ తనని అర్థం చేసుకోలేదు. తన ధోరణిని అరికట్టటానికి ప్రయత్నమూ చెయ్యలేదు. రమణమ్మ ఏం మనిషి?' అని బాధపడ్డాడు శివనారాయణ.


'ఒరే! శివిగా! అసలు నీకు బుద్ధి ఉందా? పైగా, పెళ్లాం లోకువగా దొరికిందని దాన్నే తప్పు పడుతున్నావా? బ్రతికిఉన్నంతకాలం పెళ్లాన్ని బాధ రంపానపెట్టావు. ఏనాడూ ప్రేమగా పలకరించిన పాపాన పోలేదు. ఎంతసేపూ నీ సరదాలూ, స్నేహితులూ తప్ప, పెళ్లాంపిల్లల్ని గురించి ఏనాడయినా పట్టించుకున్నావా? ముక్కుమీద కోపం పెట్టుకుని ప్రతి విషయానికీ నిప్పులు తొక్కిన కోతిలా గంతులు వేశావు. పిల్లలుకూడా నువ్వంటే భయపడి బెంబేలెత్తిపోయేలాగున ప్రవర్తించావు! రమణమ్మ అంతటి దిగులూ గుండెల్లోనే పెట్టుకుని భరించింది. కనీసం ప్రకాశరావుకికూడా చూచాయగానయినా తెలియనివ్వలేదు. దేవతలాంటి భార్యని విదిలించికొట్టి ఆవిణ్ణి నిలువునా నువ్వే చంపేశావు. ఏనాడయినా సవ్యెత్తి నీకు బదులు పలికిందా? నువ్వు మనిషివేనా?' అని అతనిలోని మరొక మనిషి గట్టిగా అన్నాడు.

శివనారాయణ పశ్చాత్తాపపడ్డాడు. కాని అప్పటికే తన నిర్లక్ష్యానికి ప్రతిగా అమూల్యమయిన రమణమ్మని పోగొట్టుకున్నాడు.

అప్పటినించీ శివనారాయణ మారిపోయాడు. వెంకటేశం గదివైపు కన్నెత్తి చూడటంలేదు. ఎప్పుడయినా వెళ్లాలనిపించినా, నిగ్రహించుకుని నిలదొక్కుకున్నాడు. సరదాలు అన్నీ ఇప్పుడు లేవు.

ఆఫీసు అయినాక తిన్నగా ఇంటికి వచ్చి 'గీత' చదువుకుంటున్నాడు. కొంతమనస్సు నిబ్బరం చేకూరింది. కాని పాత జ్ఞాపకాలు కళ్లముందు మెదిలి బాధ కలిగేది. రమణమ్మ లేక, ఒక చెయ్యి తీసేసినట్టు అనిపించేది.

'పిల్లలు జ్ఞాపకం వచ్చేవారు. ఈ పిల్లల్ని ఏం



అతివ

చిత్రం—కనుపర్తి గోపాలకృష్ణమూర్తి (బాపట్ల)

చెయ్యాలి? ఎట్లా పెంచాలి? రెండు రోజులక్రితం ప్రకాశరావు దగ్గిరనించి ఉత్తరం వచ్చింది, రమ్మని. వెంటనే బయలుదేరి ఆ ఊరు వెళ్లాడు శివనారాయణ.

ప్రకాశరావు, నిష్ఠూరంగా మాట్లాడాడు.

"బావా! ఇంకా నా చెల్లెలు పోయి నెలయినా నిండలేదు. అప్పుడే నువ్వు మాతో అన్ని బంధాలూ తెంపేసుకున్నావా? ఈ పిల్లల్ని ఏం చేద్దామని నీ ఉద్దేశ్యం?" అని నిలదీసి అడిగాడు.

'ఏమిటన్నట్టు' చూశాడు శివనారాయణ, ఆశ్చర్యపడుతూ!

"ఈమధ్య ఏదో పనిమీద నీ స్నేహితుడు కామేశ్వరరావు ఈ ఊరు వచ్చాడు. అతను మాటల మధ్యఅన్నాడు: నువ్వు రెండో పెళ్లి చేసుకుంటున్నావటగా? నీకు న్యాయంగా ఉందా? పిల్లలు ఏమయిపోతారు? ఆలోచించు, బావా!"

శివనారాయణ నవ్వాడు.

"నిజమే. ఆ ప్రయత్నాలు జరుగుతున్నాయి. నన్ను ఏం చెయ్యమంటావు?" అన్నాడు.

ప్రకాశరావు మొహం మాడ్చుకున్నాడు. "నీఉద్దేశ్యం నాకు గ్రహింపయింది. సరే. ఈ క్షణమే నీ పిల్లల్ని నా ఇంట్లోంచి తీసుకుపో. ఇక మనికి ఏ సంబంధమూ లేదు" అని మొహంమీద అనేసి తన కసి తీర్చుకున్నాడు.

ఆ రోజే పిల్లల్ని తీసుకుని వచ్చేశాడు శివనారాయణ. 'ప్రకాశరావు తనని అర్థం చేసుకోలేదు' అని బాధపడ్డాడు శివనారాయణ అప్పుడు.

పెద్దపిల్ల సీతకి ఎనిమిదో ఏడు. తరవాత [illegible] కుర్రాడు. చివరన చిన్నపాప. తల్లిలేని [illegible] పిల్లల మీద తనకి ఆపేక్ష లేదని ఎవరంటా[illegible]

"నాన్నా! నాకు వంట చేతనవును" అంది సీత, ధైర్యం కూడదీసుకుని.

హోటలుకి కారియర్ పట్టుకుని వెళ్లబోతున్న శివనారాయణ ఆగిపోయి ఆశ్చర్యంగా చూశాడు కూతురువంక.

"కాని, నువ్వు చెయ్యగలవా, తల్లీ?"

"చేస్తాను, నాన్నా! నువ్వు బట్టలు వేసుకో. అరగంటలో అన్నం వండేస్తానుగా!"

తొమ్మిదింటికి అన్నంతో పచ్చడి, పెరుగు వేసుకుని తిని ఆఫీసుకు వెళ్లాడు శివనారాయణ.

అప్పుడు వెళ్లటమే, వెళ్లటం ఇంటిముఖం పట్టేసరికి ఏడు దాటింది [illegible]యింది. మాణిక్యాలరావు వదిలిపెట్టలేదు. వీధి మొగలో పడుకున్న కుక్క శివనారాయణని చూసి మొరిగింది.

గబగబా అడుగులు వేశాడు శివనారాయణ.

'పిల్లలు ఏం చేస్తున్నారో? అన్నం తిన్నారా? పగలల్లా ఏం చేశారు? వాళ్లని స్కూలులో చేర్చాలి,' అనుకున్నాడు శివనారాయణ.

ఇల్లు చేరేసరికి నిశ్శబ్దంగా ఉంది.

వీధి తలుపుకి వేళ్లాడుతూఉన్న తాళాన్ని చూసిన శివనారాయణ కాళ్లు నిలిచిపోయాయి! అరుగుమీద కూర్చుని చుట్ట కాల్చుకుంటూన్న పక్కఇంటి ముసలాయన అతన్ని చూసి లేచి దగ్గిరికి వచ్చాడు.

"బాబూ! శివనారాయణ ?!"

"నేనేనండి."

"మధ్యాహ్నం ఇక్కడ పెద్ద గొడవ అయింది. ఇదిగో తాళంచేతులు."

శివనారాయణ ఆశ్చర్యపోయాడు! ఏమయింది?

"ఈ తాళంచేతు లేమిటి? నా పిల్లలు ఏరి? ఎక్కడికి వెళ్లారు?"

"ప్రకాశరావట! మీకు బావమరిది అవుతాడ్టగా? ఆయన తీసుకుని వెళ్లిపోయాడు!"

శివనారాయణ పళ్లు పటపట నూరాడు. 'నా పిల్లలతో తిరిగి అతని కేం పని?'

"ఇదిగో మీకు ఇవ్వమని ఈ ఉత్తరం ఇచ్చాడు" అని అందించాడు ముసలాయన.

ఉత్తరం ఇచ్చి శివనారాయణని ఒంటరిగా వదిలేసి వెళ్లిపోయాడు ఆయన.

"బావా! నా చెల్లెలు నీ[illegible] ద్రోహం చేసింది? గుండెమీద చెయ్యి వేసుకుని చెప్పు.

నా గుండెలు పగిలిపోతున్నాయి. బ్రతికిఉండగానే నా చెల్లెలిమీద సవతిని తెచ్చిపెట్టి నువ్వు సాధించావని ఇవాళే తెలిసింది. పనిమీద ఈ ఊరు వచ్చి మనసు నిలువక లేక పిల్లల్ని చూద్దామని వచ్చాను. నేను వచ్చేసరికి ఇంటినిండా ఎవరో జనం ఉన్నారు. మాణిక్యాలరావు అట! ఆయన తాలూకు మనుష్యులు వచ్చి ఇల్లంతా పరీక్ష చేస్తున్నారు. నన్ను చూసి వాళ్లు వెళ్లిపోయారు. వాళ్లు పసివాళ్లని నానా రకాల ప్రశ్నలూ అడిగారట! సీత గుడ్లనీరు కుక్కుకుంటూ నాతో అంతా చెప్పి బావురుమని ఏడ్చింది. 'మా నాన్న రెండో పెళ్లి చేసుకుంటున్నాడు. మీరు మా మామయ్యగారి ఇంట్లో ఉంటారా? మా నాన్నకి మీరంటే ఇష్టం లేదటగా! అందుకే మా అమ్మ చచ్చిపోయిందట'

## గర్భనిరోధానికి కొత్త మార్గం

కుటుంబ నియంత్రణలో గర్భనిరోధానికి మరి రెండేళ్ళలో 'ఇమ్యునొలాజికల్' పద్ధతిని అనుసరించ వీలవుతుంది. అనగా గర్భధారణ సమయంలో తయారయ్యే 'గొనాడా ట్రోపిన్ హార్మోన్' ను శైశవస్థితిలోనే రూపుమాపడం వల్ల గర్భాన్ని నిరోధించ వీలవుతున్నది. బొంబాయిలోని వైద్య పరిశోధకులు ఈ విషయంపై కూలంకషంగా పరిశోధనలు జరిపి ప్రయోగాలు చేసి చూస్తున్నారు.

## దొంగల రాణి మైనా

రాజస్థాన్ సన్సి జాతికి చెందిన 'మైనా' అనే ఆమె ఢిల్లీలోని పెద్ద దొంగలముఠాకు రాణి. ఆమెకింద ఎన్నో దొంగలముఠాలున్నాయి. వారు ఢిల్లీలోను, పెక్కు రాష్ట్రాలలోను దోపిడీలు చేస్తున్నారు. అయితే ఆమె దొంగలా బ్రతకడంలేదు. ప్రేమనగర్‌లో పెద్ద బంగళాలో ఉంటున్నది. ఆమె ఆస్తి మూడు లక్షల ఖరీదు చేస్తుంది. ఆమె కూతురు, కోడన్నకూడా ఇదే వ్యాపకంలో ఉన్నారు. కొడుకులుమాత్రం ఢిల్లీలో కనిపించరు. పోలీసులు అనేక సందర్భాలలో ఆమెను అరెస్టు చేశారు. ఆమె చేతికింద 17 అంతర్రాష్ట్రముఠాలున్నాయి. ఒక్కొక్క ముఠాలో 12 మంది వరకు దొంగలున్నారని తెలుస్తున్నది.

## పాకెట్ బెల్

ఇంట్లో ఉన్నప్పుడు ఫోన్ పిలుపు అందుకోవచ్చు. బయటకు వెళ్ళినప్పుడుకూడా ఎవరైనా ఫోన్ చేస్తే తెలుసుకునే సాధనాన్ని జపాన్ కనిపెట్టింది. అది జేబులో ఇమిడే గంట. దీని పరిమాణం సిగరెట్‌పెట్టెకన్న కాస్త పెద్దది. దీనిలో నాలుగు సంఖ్యలు ఉంటాయి. ఈ పాకెట్‌బెల్ ఒక్కొకదానికి ఒక్కొక నంబరు ఉంటుంది. ముందుగా 200 డయల్ చేసి, ఆ తరవాత పాకెట్ బెల్ నంబరు తిప్పితే ఆ వ్యక్తి జేబులోని గంట మోగుతుంది. అతను సమీపంలోని ఫోనుదగ్గరకు వెళ్ళి పిలుపు అందుకోవచ్చు.

## హంతకునికి రక్షణ

రాబర్ట్ కెన్నెడీని హత్యచేసిన సిర్హాం విచారణ త్వరలో ప్రారంభం కానున్నది. అయితే విచారణ జరిగే సమయంలో ఎవరైనా అతన్ని కాల్చి చంపవచ్చుననే అనుమానంతో అతనిని ఉంచడానికిగాను ఒక గాజుగదిని తయారుచేస్తున్నారు. ఈ గాజు తుపాకి కాల్పులకు చెక్కు చెదరదు. ఈ గది ఏర్పాటుకు అయ్యే ఖర్చు 20 వేల డాలర్లు.

## హంతకుడు: నర్తకి

ఢిల్లీలో సాలాహుద్దీన్ అనే వ్యక్తికి ఒక హత్యకేసులో యావజ్జీవ కారాగారశిక్ష పడ్డది. ఇటీవల అతనిని జైలునుండి న్యాయస్థానానికి తెస్తుండగా, కాపలాఉన్న పోలీసులను మభ్యపెట్టి తన ప్రియురాలి ఇంటికి వెళ్ళగలిగాడు. ఇద్దరు పోలీసులు, నేరస్థుడు నర్తకి ఇంటినుండి వస్తూండగా పోలీసు ఇన్‌స్పెక్టరు పట్టుకున్నాడు. ఒక పోలీసు పారిపోవడానికి ప్రయత్నించాడుగాని వీలుకాలేదు.

## ప్రమాదానికి క్షణం దూరం

మంగుళూరుదగ్గర కుంబ్లాలో సీదీ అనే వ్యక్తి తెల్లవారుఝామున నీళ్ళు పట్టుకోడానికి వెళ్ళాడట. కాళ్ళకింద నేల జారిపోతున్నట్టు అనిపించి, అటు చూచేసరికి పక్కనే ఉన్న గోడ, నేల కూలిపోయాయి. గదికి పరిగెత్తుకు వచ్చాడు. కొంతసేపాగి అక్కడికి వెళ్ళి చూడగా, గోడ, మన్ను ఏవీ కనిపించలేదు. అన్నీ నేలలో కూరుకుపోయాయిట.

## డబ్బు: జబ్బు

ఎక్కువ సంపాదన కలవారికే రక్తపుపోటు, గుండెజబ్బు మొదలైన ఖరీదైన రోగాలు వస్తాయి. నెలకు రెండువేలు ఆదాయం గల కుటుంబాలలో పదింట నాలుగు—ఇలాటి జబ్బులు వస్తున్నాయి. నెలకు వెయ్యి రూపాయలపై ఆదాయం వారికి డయాబెటిస్, కాన్సర్, గుండెజబ్బు, రక్తపుపోటు వస్తున్నాయి. తక్కువ ఆదాయాలవారికి ఇలాటి జబ్బులు తక్కువగానే వస్తాయి.

సేకరణ : శార్వరి

---

అంటూ అన్నారట ఆ పసివాళ్ళతో! ఎంత రాక్షసం! నీకూ జాలి అనేది లేదా, బావా?

నువ్వేమయినా అనుకో, బావా! నేను కోపం పట్టలేక పోయాను. రోడ్డుమీద ఉన్నవాళ్ళని పిలిచి నాలుగూ దులిపేశాను. మొహాలు మాడ్చుకుని వెళ్ళిపోయారు వాళ్ళు. నోరులేని నా చెల్లెలు వెళ్ళి పోయింది. అది నా దురదృష్టం. కాని, బావా! ఆ తల్లిలేని పిల్లల్ని చూస్తే నీకు జాలి కలగటంలేదా? వాళ్ళు నీ పిల్లలే గదా! వాళ్ళమీదా నీకు ఎందుకీ కక్ష? నీ వ్యామోహాలకి పిల్లల్ని బలిచేస్తావా? నీలో అంత స్వార్థం కరుడుగట్టి ఉందా? నేను చెపుతున్నాను బావా! ఏది ఏమయినాసరే! నువ్వు నరకానికి పోతావు. భగవంతుడు నిన్ను క్షమించడు. నా చెల్లెలు పిల్లలకి తండ్రి ఉండీ లేనట్టే లెక్క? అయినాసరే వాళ్ళు దిక్కులేనివాళ్ళు కారు. పిల్లల్ని తీసుకుపోతున్నాను. ఇక వాళ్ళు అక్కడే ఉంటారు. నువ్వు నీ ఇష్టం వచ్చినట్టు ఊరేగు. నా చెల్లెలుమీది అభిమానం—నాచేత ఈ పని చేయించింది. కోర్టుకి వెళ్ళితే నువ్వు గెలుస్తావని నాకు తెలుసు. కాని ఒక సంగతి జ్ఞాపకం ఉంచుకో! తిరిగి పిల్లలమీద నీ రాక్షసత్వం చూపించబోయావా, నీ రక్తం కళ్ళ చూస్తాను. నువ్వో, నేనో ఎవరో ఒకళ్ళే మిగులుతారు అప్పుడు. కనక ఆ ప్రయత్నం మాను. ఇకనించీ ఆ పిల్లలు నీ పిల్లలు కారు, మా పిల్లలు.

రెండు కాకపోతే, మూడు పెళ్ళిళ్ళు చేసుకుని నీ ఇష్టం వచ్చినట్టు ఊరేగు. అంతేగాని పిల్లల జోలికి రావద్దు.

ఇట్లు,
—ప్రకాశరావు."

ఉత్తరం చదువుకుని దీర్ఘంగా నిట్టూర్చాడు శివనారాయణ.

మంచికీ చెడుకీ మధ్య మనస్సు ఊగిసలాడింది. శివనారాయణ మనస్సులో తెరుచుకోబోతున్న తలుపులు మూసుకున్నాయి. ద్వేషం, కసి ఉవ్వెత్తున అతనిలో లేచాయి. ఇంటికి తాళంవేసి రోడ్డుమీదికి వచ్చాడు శివనారాయణ.

అందరూ తనని పిచ్చివాడిని చేద్దామనుకుంటున్నారు. తనకి మాటదూకుడు కొంచెం ఎక్కువే. అంతమాత్రానికే తనని దూరంగా ఉంచింది రమణమ్మ. ప్రకాశరావు అనుమానపడ్డాడు. మాణిక్యాలరావు తన అవసరం తీర్చుకోవాలని చూశాడు. అందరూ స్వార్థపరులు. వాళ్ళకి హృదయం లేదు.

ఎవరూ తన్నర్థం చేసుకున్న పాపాన పోలేదు. తనేం చేశాడని? మంచికి గుర్తింపు లేదు. చెడు లేకపోయినా ఉందని రంగులు పూస్తారు. ఈ ప్రపంచం అటువంటిది. రమణా! నువ్వూ నాలోని మంచిని పైకి తియ్యలేకపోయావు! నా బాహ్యస్వరూపం అటువంటిదా? ఏం చెయ్యను? నేను పిచ్చివాడిని. అందరికీ చెడ్డవాడిని. సరే! చెడ్డవాడుగానే ఉండిపోతాను! నా గురించి ఎవరూ జాలి పడక్కర్లేదు!

శివనారాయణ కళ్ళవెంట నీరు ఊరింది. ఒక నిశ్చయానికి వచ్చిన శివనారాయణ సిగరెట్టు వెలిగించి వెంకటేశం గదివైపు అడుగులు వేశాడు. నాలుగడుగులు వేశాక హఠాత్తుగా ఆగి, వెనక్కి తిరిగాడు శివనారాయణ!

"ఉహుఁ" అనుకుంటూ గొణిగాడు. దూరంగా వెంకటేశం గదిలోనించి వెలుతురు రోడ్డుమీద పడుతూంది. నవ్వులు, కేకలు అస్పష్టంగా వినిపిస్తున్నాయి. ఆ క్షణం శివనారాయణ మనసు మంచిచెడుల మధ్య ఊగిసలాడింది. వెనక్కి తిరిగి, ఇంటి తాళం వేసి, సంచిలో బట్టలు సర్దుకుని, బయటికి వచ్చి రైలుస్టేషనువైపు వెళ్ళాడు శివనారాయణ. తొమ్మిదయింది. తొమ్మిదిన్నరకి ప్రకాశరావు ఊరికి వెళ్ళే రైలు ఉంది. ★